

బస్సు టైర్‌లో ఇరుక్కుని మృతిచెందిన నడిపి రాములు

చికిత్స కోసమని వెళ్లి తిరిగిరాని లోకాలకు..



మృతుడు నడిపి రాములు (ఫైల్)



మృతుడు శ్రీహాన్స్ (ఫైల్)

- ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరి మృతి
- మృతులిద్దరూ తాతామనువడు
- రాజంపేటలోని పెద్దాయిపల్లిలో ఘటన

రాజంపేట, జూన్9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ వృద్ధుడు, బాలుడు ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటప సోమవారం రాజంపేట మండలం పెద్దాయిపల్లి గేటు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన దోమకొండ నడిపి రాములు (56), తన మనుమడు శ్రీహాన్స్ (5) కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై రాజంపేట పీహెచ్‌సీకి వెళ్తున్నారు. అయితే ఇటీవల శ్రీహాన్స్‌కు కుక్క కరువడంతో చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి వెళ్లారు. చికిత్స అనంతరం తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో పెద్దయిపల్లి గేట్ దగ్గరం గుండారం నుంచి కామారెడ్డి వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి రాములు, శ్రీహాన్స్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. బస్సు కింద ఎక్సెల్ వాహనం ఇరుకుపోవడంతో తాత, మనుమడు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు

కామారెడ్డిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జిల్లా అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎం రమేష్‌కు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న యూనిఫాం కుట్టే పనులలో అలసత్వం వహించినందుకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఏడీఆర్‌డీవో, డీపీఎంతోపాటు బీబీపేట ఏపీఎం బాల పోశయ్య, పిట్లం ఏపీఎం శిరీష, తాడ్వాయి ఏపీఎం మనోహర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామని అదనపు కలెక్టర్ చందర్‌నాయక్ పేర్కొన్నారు.



ఆర్టీసీ బస్సులు దారి తప్పుతున్నాయ్!

- జిల్లాలో తరుచూ ప్రమాదాలకు గురవుతున్న ఆర్టీసీ బస్సులు
- ఇటీవల నలుగురు మృత్యువాత.. మరో 10 మందికి గాయాలు
- గతంలోనూ 12 వరకు ప్రమాదాలు
- అద్దె బస్సులతోనే అసలు సమస్య
- నైపుణ్యం, అనుభవం లేని వారితో డ్రైవింగ్
- కాలం చెల్లిన బస్సులతో ప్రమాదాలు జరుగుతున్న వైనం
- బస్సులపై ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కరువు

కామారెడ్డి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ ప్రమాదాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్న ఆర్టీసీ ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఏదో ఒకచోట ఆర్టీసీ బస్సులతో ప్రమాదాలు చోటు చేసుకుంటుండడం, ప్రాణనష్టం జరుగుతుండడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుతారనే నమ్మకం ప్రయాణికులలో ఉంది. కానీ జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అద్దెబస్సులతో ప్రమాదాలు జరుగుతున్న చెడ్డపేరు మాత్రం ఆర్టీసీకే వస్తోంది. తరుచూ ప్రమాదాలు చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నా క్షేత్రస్థాయిలో రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదాల కారణంగా ఆర్టీసీ కోట్ల రూపాయల నష్టం పరిహారం చెల్లించాల్సి వస్తోంది. బస్సుల నిర్వహణ సక్రమంగా లేదనే విమర్శలున్నాయి.

జిల్లాలో 253 ఆర్టీసీ బస్సులు

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్‌ల పరిధిలో ఆర్టీసీ సంస్థ తరఫున కామారెడ్డి, బాన్సువాడ ఆర్టీసీ డీపోలు ఉన్నాయి. ఈ రెండు డిపోల పరిధిలో 253 ఆర్టీసీ బస్సులు ఉండగా ఇందులో ఆర్టీసీ సంస్థకు సంబంధించినవి 152, అద్దె బస్సులు(హైయర్) 91 ఉన్నాయి.కామారెడ్డి డిపో పరిధిలో మొత్తం 137 బస్సులు ఉండగా ఇందులో ఆర్టీసీవి 81, హైయర్ బస్సులు 56 ఉన్నాయి. ఇందులో పల్లె వెలుగులు 99, ఎక్స్‌ప్రెస్‌లు 22, డీలక్స్‌లు 15 ఉన్నాయి. బాన్సువాడ డిపో పరిధిలో మొత్తం 106 బస్సులు ఉండగా



ఆర్టీసీవి 71, హైయర్ బస్సులు 35 ఉన్నాయి. ఇందులో పల్లె వెలుగులు 75, ఎక్స్‌ప్రెస్‌లు 15, డీలక్స్‌లు 10 బస్సులు ఉన్నాయి. ఈ డిపోల బస్సులు జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాలతోపాటు నిజామాబాద్, హైదరాబాద్, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు వస్తూ పోతుంటాయి. ప్రతీరోజు సుమారు 87,649 కి.మి ప్రయాణిస్తుంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీ సంస్థలో సుమారు 600మంది డ్రైవర్‌లు, కండెక్టర్‌లు ఇతర ఉద్యోగులు ఉన్నారు.

అద్దె బస్సులతోనే అసలు సమస్య

ఆర్టీసీలో అద్దె బస్సుల నిర్వహణ వ్యయం తక్కువగా ఉండడంతో పాటు సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరం ఉండదు. ఈ కారణంగా ఆర్టీసీ యాజమాన్యం అద్దెబస్సులను వినియోగించుకుంటోంది. ఇలా జిల్లాలో రెండుడీపోల పరిధిలో మొత్తం 91 హైయర్ బస్సులు ఉన్నాయి. కానీ అద్దె బస్సులు నడుపుతున్న ప్రైవేట్ డ్రైవర్‌లు సరైన శిక్షణ లేకుండానే వస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్లే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా రాజంపేట మండలంలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఢీకొనడంతో మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదాలు అనేకమంది కుటుంబాల్లో చీకట్లను నింపుతున్నాయి. దీనికి తోడు ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కూడా సరిగా ఉండడం లేదని ఆర్టీసీ సిబ్బంది తక్కువగా ఉండడంతో గత్యంతరం లేక అనుభవం లేని వారికి బస్సులను అప్పగిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

కాలం చెల్లిన బస్సులతోనూ ప్రమాదాలు

ఆర్టీసీలో అద్దె బస్సులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. కొత్త బస్సులను కొనుగోలు చేయడం లేదు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో కాలం చెల్లిన బస్సులనే వినియోగిస్తున్నారనే వాదన ప్రయాణికుల నుంచి వినిపిస్తోంది. ఈ బస్సులు మరి అధ్వానంగా ఉంటున్నాయి. పైన చూడడానికి అందగా ఉండే విధంగా రంగులు వేసి రోడ్డెక్కిస్తున్నారు. రెండు డిపోల పరిధిలోని చాలా బస్సులు అధ్వానంగా మారినట్లు తెలుస్తుంది. రోడ్డు ఎక్కిన బస్సు గమ్యస్థానాలకు చేరేంత వరకు కూడా నమ్మకం లేని పరిస్థితి బ్రేకులు ఫేల్ కావడం, స్టీరింగ్ పనిచేయకపోవడం, కిటికిలు లేకపోవడం, డోర్లు సరిగా పడకపోవడం వంటి (మిగతా 8వ పేజీలో..)



జోరుగా.. హుషారుగా ఖరీఫ్ పంటల సాగు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

7

టీయూ స్నాతకోత్సవానికి హాజరు కండి
- గవర్నర్‌కు ఆహ్వానం అందజేసిన టీయూ వీసీ యాదగిరి రావు

7

పేపర్ ప్లేట్ల రాకతో కనుమరుగైన మోదుగ విస్తర్లు
- గతంలో కుటీర పరిశ్రమగా..
- నేడు ప్లాస్టిక్ రాకతో మాయం





జిల్లాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- మంత్రి సీతక్క
- జిల్లాధికారులతో వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డిటౌన్, జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంతో కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్నామని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి, సీఎస్ రామకృష్ణతో కలిసి బడి బాట, ఇందిరా మహిళాశక్తి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందులో భాగంగానే మహిళా సంఘాలకు పెట్రోల్‌పంప్‌లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జిల్లాల్లో ఈ పెట్రోల్‌బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని ఆదేశించారు. వీటితోపాటుగా మహిళా సంఘాలకు రైస్‌మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట స్థాపన, ఆర్టీసీకు అద్దె బస్సులు నడపటం వంటి అనేక కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళాశక్తి భవనాలను పూర్తిచేయాలని అన్నారు. ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభం కానున్న దృష్ట్యా పండుగ వాతవరణంలో ఏకరూప దుస్తులను విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలన్నారు. సీఎస్ మాట్లాడుతూ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, విద్యా సంవత్సరం ప్రారంభంలో తీసుకోవాల్సిన చర్యలు సంపూర్ణంగా చేపట్టాలని అన్నారు. వంద శాతం పిల్లలు బడులలో ఎన్‌రోల్‌మెంట్ కలిగి ఉండాలని సూచించారు. తొలి మెట్టు కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ మాట్లాడుతూ పాఠశాలల యూనిఫాం 12వ తారీఖులోపు స్టిచ్చింగ్ పూర్తిచేసి పంపిణీకి సిద్ధం చేస్తామన్నారు. మహిళా శక్తి భవనాల నిర్మాణం ప్రగతిలో ఉందని నవంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో నియోజకవర్గాని ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటుకు నెలాఖరులోగా స్థల సేకరణ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, డీఈవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు వదచ్చినట్లు వెల్లడించారు. భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు, రైతుభరోసా తదితర అంశాలపై దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలలు జూన్ 12 నుంచి ప్రారంభం అవుతున్నందున పాఠశాల యొక్క స్థితిగతులను మండల స్పెషల్ ఆఫీసర్లు ఎంపీడీఓలు పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్‌నాయక్, ఆర్‌డీఓ వీణ పాల్గొన్నారు.





దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి

వర్షకాలం నేపథ్యంలో దోమలవ్యాప్తి పెరుగుతోందని, నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో దోమల నివారణ చర్యల కోసం తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. దోమ లార్వాలు పెరగకుండా నీటి మడుగులుఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్, మందులు చల్లాలని తెలిపారు. ప్రతీ గ్రామంలో పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్ల పరిసరాల శుభ్రత చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ మురళి, డీఈవో రాజు, జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు చేపట్టాలి : కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చూడాలని, రైతులకు విత్తనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట సాగులో ఏమైనా అవగాహనా లోపం ఉంటే అధికారులు సహకరించాలని తెలిపారు. యూరియా, డీఏపీ వంటి ఎరువుల కొరత రాకుండా చూడాలని తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువుల కొరత, విత్తనాల కొరత వంటి సమస్య రావొద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఏవో తిరుమలప్రసాద్, ఏడీఏ, ఏవో, ఏఈవోలు పాల్గొన్నారు.

పట్టణంలో భారీ వర్షం

- జిల్లా కేంద్రంలోని రోడ్లన్నీ జలమయం
- యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది

కామారెడ్డి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. గత మేలోనే వర్షాలు ప్రారంభమైనా కొద్దిరోజుల క్రితం వరకు ఎండ తీవ్రత పెరుగు తూనే వచ్చింది. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం తెల్లవారు జామున దాదాపు 6 గంటలు జిల్లాలోని ఆయా మండలాల్లో భారీ వర్షం కురువడంతో రోడ్లన్ని జలమయం అయ్యాయి. మే నెలలోనే వర్షాలు పడ్డా అధికారులు ముందస్తు పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. మురికి కాలువల్లో పేరుకుపోయిన పూడికతో వరద నీరు అంతా రోడ్లపైకి వచ్చి చేరింది. రోడ్ల వెంట మట్టి ఉండడంతో వర్షపునీరు పారలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, హౌజింగ్ బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీలో ఎప్పటిలాగే వరదనీటితో ఇక్కట్లు తప్పలేదు. ఏళ్ల నుంచి రైల్వే కమాన్ నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లే దారిలో పోలీసుస్టేషన్‌కు ఎదురుగా అక్కడి నుంచి కొద్దిగా ముందుకు వచ్చిన తర్వాత వ్యాపార సముదాయాల వద్ద మురికి కాలువలు సరిగా లేక నీరు నిలుస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప దీర్ఘకాలికంగా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. స్థానిక సంస్థల్లో పాలకవర్గాలు లేకపోవడంతో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఏపుగా పెరిగినచెట్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టిన సిబ్బంది

ప్రతీ ఏడాది నిజాంసాగర్ రోడ్డు, సిరిసిల్లరోడ్డు, టీచర్స్ కాలనీలతో పాటు హౌజింగ్ బోర్డు కాలనీలలో వరద నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతుంటారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సి ఉన్న అధికారులు పెడచెవిన పెట్టడంతో సోమవారం కురిసిన వర్షానికి అవే ఇబ్బందులనుప్రజలు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో యుద్ధ ప్రతిపాదికన మున్సిపల్ సిబ్బంది పనులు చేపట్టారు. నిజాంసాగర్ రోడ్డులో భారీగా నిలిచిన నీటిని మురికికాలువల ద్వారా వెళ్లేలా, హౌజింగ్ బోర్డు కాలనీలో సత్యగార్డెన్ వైపుగా వెళ్లె దారిలో సరిగ్గా నీరు పోయ్యేందుకు చర్యలు తీసుకోకపోవడంతో భారీగా నీరు నిలిచింది. దీంతో మున్సిపల్ (మిగతా 8వ పేజీలో..)



ఓల్డ్ ఎన్‌హెచ్-7 రోడ్డుపై నిలిచిన నీరు



నిలిచిన వరద నీరు కాల్వల్లోకి వెళ్లేలా పనులు చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

బీర్కూర్‌లో 98.3 మి.మీ. వర్షం

బీర్కూర్: బీర్కూర్‌లో ఆదివారం అర్ధరాత్రి 98.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బలమైన ఈదురు గాలులకు వృక్షాలు నేలకొరిగాయి. భారీ వర్షం కారణంగా వ్యవసాయ క్షేత్రాల్లో భారీగా వరద నీరు నిలిచింది. బీర్కూర్‌లో ఇళ్ల మధ్య వరద నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే జిల్లాలోనే బీర్కూర్ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉప కాలువను పరిశీలించిన ఇరిగేషన్ అధికారి



ఉప కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈఈ శ్రీధర్

నవీపేట,జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్, నాడాపూర్ గ్రామాల మధ్యన ఉన్న డీ50/4/10 ఉప కాలువను సోమవారం ఇరిగేషన్ ఏఈఈ శ్రీధర్ పరిశీలించారు. ఇటీవల కమలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఉప కాలువ గట్టును కబ్జా చేయడంతో అవతల వైపు పొలాలకు వెళ్లకుండా మార్గాన్ని మూసి వేశాడని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇటీవల ఇరిగేషన్ ఈఈ బలరాం ఉప కాలువను పరిశీలించగా సోమవారం ఏఈఈ శ్రీధర్ పరిశీలించారు. ఉప కాలువ గట్టును తమ సొంత ఖర్చుతో చదును చేసుకుని బాగు చేసుకోగా సంబంధిత వ్యక్తి జేసీబీ సహాయంతో కూల్చి వేశాడని రైతులు ఆరోపించారు. ఈ విషయంపై ఏఈఈ శ్రీధర్ మాట్లాడుతూ ఉప కాలువ గట్టు ధ్వంసం చేసి కబ్జా చేసిన వ్యక్తిపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



కొత్తపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముప్కాల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. వేంపల్లి, కొత్తపల్లి, ముప్కాల్ గ్రామాలలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌ఖేత్ అధ్యక్షుడు బద్దం సాగర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద రవి, లక్ష్మణ్, రాజారెడ్డి, నర్సారెడ్డి, దినేష్‌యాదవ్,మహేష్‌యాదవ్, తేలు గోపి, ఎట్టం శ్రీనివాస్,ఏలేటి విజయ్, రవి, గంగాధర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: అనారోగ్యానికి గురై ఆదుకోవాలని దరఖాస్తు చేసుకున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి అందజేశారు. సిరికొండ మండలం రామడుగు గ్రామానికి చెందిన కుందేళ్ల సాయిలు, నక్కా రాజేశ్వర్,కుందేళ్ల నర్సయ్య ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మంజూరు చేయించారని రవి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాకారం సంతోష్, బండారి నరేష్ , శశికిరణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నక్కా రాజేందర్,కాంగ్రెస్ నాయకులు కిష్టారెడ్డి,రాజేశ్వర్,నరేష్,సాయిలు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబసభ్యులకు ఎమ్మెల్సీ కవిత పరామర్శ

జక్రాన్‌పల్లి , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ కుంచాల విమల రాజు తల్లి కుంచాల సాయమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం కుంచాల విమల రాజును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. అనంతరం కుంచాల రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్న, నాయకులు షైదం రాజన్న, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు క్యాబినెట్‌లో సముచిత స్థానం కల్పించండి

నిజామాబాద్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీలకు క్యాబినెట్‌లో సముచిత స్థానం కల్పించాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బంజారా సదర్ సంఘం అధ్యక్షుడు రాజునాయక్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారా, లంబాడా ఓట్ల తో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, కాని ఎస్టీలకు క్యాబినెట్‌లో సముచిత స్థానం కల్పించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీలకు క్యాబినెట్‌లో అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో మోహన్‌నాయక్, కైలాష్ నాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు అధునాతన హంగులు

సుభాష్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఉపకేంద్రాలకు అధునాతన హంగులు కల్పించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బా, సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్‌లకు పెయింటింగ్‌లతో పాటు మెటల్ స్ప్రేయింగ్‌లను ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్‌కు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోనే ప్రతీడివిజన్‌లో 10 సబ్‌స్టేషన్‌లకు రెనోవేషన్‌లో భాగంగా ఆధునిక హంగులు కల్పించారు.

'బోధన్ అభివృద్ధి కావొద్దనే మంత్రి పదవి ఇవ్వలేదు'

బోధన్‌రూరల్,జూన్9(ఆంధ్రజ్యోతి): బోధన్ నియోజకవర్గం అభివృద్ధి కావద్దనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం లేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి మచ్చలేని నాయకుడు అని ఆయన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మంత్రి పదవి ఇవ్వడంలో అధిష్టానం జాప్యం చేస్తుందన్నారు. ఈ పాటికే మంత్రి పదవి ఇవ్వాల్సి ఉందని నిజాయితీకి నిదర్శనంగా పని చేసే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వెంటనే మంత్రి పదవి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

'బోధన్ నియోజకవర్గానికి అన్యాయం'

బోధన్‌రూరల్,జూన్9(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి తప్పకుండా మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వకుండా నియోజకవర్గ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని ఆరోపించారు. వెంటనే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆయన డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఘన నివాళి

ఎడపల్లి, జూన్9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా రాంచంద్రా బంజారా గ్రామపంచాయతీ కార్యదర్శి బానోత్ సోనాలి సోమవారం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఎడపల్లి మండల పంచాయితీ కార్యదర్శులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు ఉదయ భాస్కర్, నాగరాజు గౌడ్, రాంరెడ్డి, గంగాధర్, రాజు, అమ్రీన్, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిపో మేనేజర్‌కు వినతి

రుద్రూరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): రైడ్స్ అధ్యక్షులు కర్రోళ్ల కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం బోధన్ బస్‌డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను కలిసి రుద్రూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అంగడిబజార్‌లో బస్సు ఎక్కి దిగడానికి అనుమతించే విధంగా వారి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని, అలాగే రుద్రూరు బస్టాండ్‌లో టాయిలెట్స్‌ను కూడా అందుబాటులోకి తేవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైడ్స్ ఉపాధ్యక్షులు, కోశాధికారి, గౌరవ సలహాదారులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నాడాపూర్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్



మంథనిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు



అమీర్‌నగర్‌లో దరఖాస్తులను పరిశీస్తున్న ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్

రెవెన్యూ సదస్సులను పరిశీలించిన ఆర్డీవో

నవీపేట,జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం, నాడాపూర్‌లలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సంబంధిత రెవెన్యూ సదస్సులను సోమవారం నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, నాయబ్ తహసీల్దార్ రంజిత్ కుమార్ తదితరులున్నారు.

ఆర్మూర్‌రూరల్:మండలంలోని మంథని,కొటార్మూర్ గ్రామా లలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ రైతులు తమభూముల సమస్య లను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని అందరు సద్వినియోగం చేసుకోవా లని కోరారు.మంథనిలో 24 దరఖాస్తులు, కొటార్మూర్‌లో 21 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈసదస్సుకు రైతులు హాజరై తమ భూముల సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సదస్సులో దరఖాస్తులు చేసుకున్నారు.రైతుల నుంచి దరఖాస్తులను తహసీల్దార్ కిరణ్మయి తీసుకున్నారు. అనంతరం వచ్చిన దరఖాస్తులను వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆర్ఐ,తహసీల్దార్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోపాల్:ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూభారతి రెవెన్యూ చట్టాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మోపాల్ తహశీల్దార్ రామేశ్వర్ కోరారు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారులకు దరఖాస్తుల రూపంలో ఇవ్వాలని కోరారు. కార్యాలయాల చుట్టూ రైతులు వివిధ సమస్యలతో తిరుగుతున్నారని ఇకనుండి రైతులు సమర్పించిన దరఖాస్తులతోనే వారి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటికే భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని తెలిపారు. మోపాల్ మండల కేంద్రంలో సోమవారం భూభారతి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు.ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లి, రాంపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు సోమవారం జరిగాయి. యానంపల్లిలో తహసీల్దార్ సతీశ్‌రెడ్డి , ఆర్ఐ సంతోశ్ లు రైతుల నుంచి ధరఖాస్తులు స్వయంగా స్వీకరించారు. రాంపూర్ లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ , మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభు లు ధరఖాస్తు పత్రాలు స్వీకరించారు. ఏవైరన ధరఖాస్తులు ఇచ్చే సమయంలో అందుబాటులో రైతులు లేకుంటే తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ సతీశ్‌రెడ్డి కోరారు.

కోటగిరి: భూభారతి చట్టంతో రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కోటగిరి ఉమ్మడి మండలాల తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని సుద్దులం, కొల్లూర్ గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కొల్లూర్ గ్రామంలో 13దరఖాస్తులుగా రాగా సుద్దులం 5దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్లు అజీజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులను భూ సమస్యల నుండి విముక్తి కలిగించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని అందులో భాగంగా సోమవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించడం జరిగిందని, భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి పేర్కొన్నారు. జైతాపూర్ గ్రామంలో సుమారు 11కి పైగా వివిధ రకాల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పట్టాపాస్ బుక్కుల్లో ఉన్న భూమికి, సాగులో ఉన్న భూమికి తేడా ఉండడంతో పాటు పాస్ బుక్‌లో సర్వే నెంబర్లు, పేర్ల నమోదులో తప్పులు దొర్లినట్లు పలువురు ఫిర్యాదు చేశారన్నారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి భూ సమస్యను పరిష్కరిస్తామని ఎడపల్లి తహసీల్దార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అనూష, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, బ్రాహ్మణ్‌పల్లి రైతులు తదితరులున్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ , జాన్కం పేట్ గ్రామాలలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్, డిటి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాలలో భూమికి సంబంధించిన దరఖాస్తులు అధికారులకు ఇవ్వడానికి రైతులు బారులు తీరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్, డిటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ తమ భూములకు సంబంధించి ఏ సమస్యలున్న ధరఖాస్తులు చేసుకోవచ్చని ఇచ్చిన ధరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదిస్తు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అప్పటి వరకు సమన్వయం పాటించాలని సూచించారు. జాన్కంపేట్‌లో భూమికి సంబంధించిన సమస్యల ధరఖాస్తులు 27, పచ్చల నడ్కుడలో 15 ధరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, రెవెన్యూ సిబ్బంది మహేష్, ప్రజ్ఞ, శేఖర్, అలేఖ్య, శ్రీనివాస్, ఉమ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులు ఎదుర్కొంటున్న తమ భూములకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించుకునే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల వారిగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాదని రైతులు ఈసదస్సులను సద్వినియోగం చేసుకుంటూ తమ భూములకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించుకోవాలని ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని అమీర్‌నగర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా సదస్సుకు ఆర్మూర్ ఆర్డీవో రాజగౌడ్ హాజరయ్యారు. సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా అమీర్‌నగర్‌లో సాయంత్ర 4 గంటలవరకు సుమారు 139 దరకాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు, ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్, కోనాసమందర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆకుల రాజన్న, గ్రామ కాంగ్రెస్ అధ్య క్షుడు పుప్పాల నర్సయ్య, నాయకులు గంగారెడ్డి భూమన్న,శరత్, ఏఆర్ఐ ప్రదీప్,గ్రామ రెవెన్యూ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయంలో పంచామృతాలతో, బిల్వ పత్రాలతో అభిషేకం చేశారు. రామాలయం, దుర్గామాత, దత్తాత్రయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, ఏకశిలస్తంబం వద్ద గల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ధర్శించుకున్నారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని భక్తిగీతాలు ఆలపించి నృత్యాల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు సుమన్, గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, రవి, బోండ్ల ఆనంద్, శంకర్, ప్రశాంత్‌గౌడ్, అర్చకుడు శర్మ తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో బీజేపీ నాయకుల ధర్నా

కోటగిరి,జూన్9(ఆంధ్రజ్యోతి): పొతంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు బోనస్, రైతు భరోసా అందిస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మాండ్లు, మక్కయ్య, మోహన్, గంగారాం, నాగభూషణం, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ముత్యాల సునీల్ పరామర్శ

ఏర్గట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ మీణ ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ మాజీ సర్పంచ్ మీణ భర్త పిట్ల నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గడ్డం జీవన్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరి విద్యార్థుల ఎంపిక

వేల్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన విద్యార్థులు ఎం.రశ్మిత, మనస్విత ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎపికైనట్లు హెచ్ఎం వైద్య గణేష్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్కాలర్‌షిప్ పరిక్షలో ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాదించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు వారు తెలిపారు. వరుసగా గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ పాఠశాల నుంచి విద్యార్థులు నేషనల్ మీన్స్ కంమెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవు తున్నందున విద్యార్థులను ఉపాధ్యాయులు మహేందర్, రత్నయ్య, సురేష్, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి సీవీ నరసింహారావు అభినందించారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

భీమ్‌గల్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మండల అధ్యక్షుడు రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఓఫంక్షన్ హాల్‌లో 11ఏళ్ల మోదీ ప్రభుత్వం- సంకల్పంతో సాకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పిలుపు మేరకు మాకే నాంపే ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మల్కన్నగారి మోహన్, యోగేశ్వర నర్సయ్య, లక్ష్మణ్‌గౌడ్, మహి పాల్, మహేందర్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, పల్లికొండ ప్రసాద్,సంజయ్, ప్రకాష్‌నాయక్, వెంకటేష్, లింగం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నవీపేట,జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పుప్పాల బుచ్చక్క(108)అనే శతాధిక వృద్ధురాలు సోమవారం ఉదయం మృతి చెందారు. గత వారం క్రితం వరకు బుచ్చక్క తన పనులు తాను స్వయంగా చేసుకునే వారని గ్రామస్థులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, మనువలు, మనువరాళ్లు ఉన్నారు. బుచ్చక్క మృతి పట్ల గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

నిజామాబాద్ అర్బన్,జూన్ 9(ఆంధ్రజ్యోతి):మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలుశిక్షతో పాటు 30 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. ఈనెల 9న మద్యం తాగుతూ వాహనాలు నడిపిన వారిని సెకండ్‌క్లాస్ న్యాయాధికారి నూర్‌జాన్ ముందు హాజరుపర్చగా 30 మందికి రూ.57వేలు, ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

కొడుకు సరిగ్గా మాట్లాడడంలేదని తల్లి ఆత్మహత్య

నిజామాబాద్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొడుకు తనతో ఫోన్‌లో సరిగ్గా మాట్లాడటం లేదని మనస్థాపంతో తల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చంద్రశేఖర్ కాలనీలో నివాసం ఉండే హోలియా లక్ష్మి (44) ఇటీవల ఇంటిని కొనుగోలు చేయగా కుమారుడు రోహిత్ కొన్ని డబ్బులు పంపాడు. మిగతా డబ్బులు కొడుకును అడగగా అతను సరిగ్గా మాట్లాడకపోవడం, ఇంటి కొనుగోలుకు డబ్బులు సర్దుబాటు కాక మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని లక్ష్మి ఆత్మహత్య చేసుకున్నట్లు 3వ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హోమంలో పాల్గొన్న రజక సంఘం సభ్యులు

డిచ్‌పల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్‌లో సోమవారం రజక సంఘ ప్రతినిధులు మడేలయ్య స్వామి వారి 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు నల్లవెల్లి సాయి లు, గ్రామ అధ్యక్షుడు బొల్లరం రమేశ్, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రవీందర్, కోశాధికారి గంగాధర్, ప్రధాన కార్యదర్శి సుమన్, సాగర్, రవి, శ్రీనివాస్, తిరుపతి, గ్రామ మహిళలు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ

ఆర్మూర్ రూరల్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని నాలుగవ వార్డులో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను లబ్ధిదారులకు వార్డు ఇన్‌చార్జి గుర్రం సునీల్ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ పెంట బోజారెడ్డి అందజేశారు. అనంతరం ఇండ్ల నిర్మాణానికి ముగ్గుపోశారు.

ఖుద్వాన్‌పూర్‌లో భూమి పూజ..

నందిపేట : మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్మూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ భూమిపూజ చేశారు. మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామానికే అత్యధిక ఇందిరమ్మ ఇళ్ళు మంజూరైనట్లు బైండ్ల ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కండెల నరేష్, ఇంది రమ్మ కమిటీ సభ్యులు మంగ్లారపు తుక్కన్న, ఏర్రక్క, గంగామణి, సాయన్న, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, లబ్దిదారులున్నారు.

బోధన్ ఎమ్మెల్యేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

నవీపేట,జూన్9(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సోమవారం పలువురు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే స్వగృహనికి తరలివెళ్లారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డికి స్థానం కల్పించాల్సిన అవశ్యకత ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భగవాన్, చల్లా రవీందర్, గంగాధర్, వసంత్, గోపాల్ తదితరులున్నారు.

న్యాయవాది గంట విప్లవ్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయవాదుల సహకార సొసైటీ సంయుక్త కార్యదర్శి ఏకగ్రీవంగా నియామకమైన న్యాయవాది గంట విప్లవ్‌కు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని బార్‌అసోసియేషన్ భవన్‌లో అయనను పట్టుశాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో భార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, చైతన్య, గంగారాం, లోక భూపతిరెడ్డి, గంట సదా నందం, గంగారెడ్డి, కృష్ణపండిత్, చిల్క కిష్టయ్య, ఎంకే నరేందర్ పాల్గొన్నారు.

రైల్వేగేట్‌మెన్ ఉరేసుకుని ఆత్మహత్య

నవీపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంకు చెందిన 189 ఈ రైల్వేగేటు వద్ద విధులు నిర్వహిస్తున్న గేట్‌మెన్ విజయేంద్ర కుమార్ బైర్వా (29) సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలోని షేక్‌పుర, సిక్రాయి, డౌసాకు చెందిన విజయేంద్ర కుమార్ బైర్వా సోమవారం తెల్లవారుజామున సుమారు 4:40గంటల సమయంలో గేట్‌మెన్ రూమ్‌లో విధుల్లో ఉండగా సిలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన తెలిపారు. మృతుడు గత సంవత్సరం నుంచి గేట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, కుటుంబ సమస్యలతో అతడు ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్లు రైల్వే ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని ఆయన పేర్కొన్నారు. మృతుడు అవివాహితుడు అని రైల్వే ఎస్ఐ వివరించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

నవీపేట, జూన్9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బాపూర్(ఎం)లో బాధిత కుటుంబాన్ని సోమవారం పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. నవీపేట సొసైటీ ఛైర్మన్ అబ్బన్న తల్లి ఇటీవల గుండె పోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంకిషన్ రావులు వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో శేఖర్ రెడ్డి, తెడ్డు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ను తొలగించాలని ప్రజావాణిలో దరఖాస్తు

కమ్మర్‌పల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండంలోని ఉప్లూర్ గ్రామంలో జనావాసాల మధ్య తీవ్ర ఇబ్బందిగా మారిన రైస్‌మిల్ వేరేచోటకు తరలించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. రైస్‌మిల్ కారణంగా ప్రతీ రోజు దుమ్ముదూలిలతో పాటు శ్వాసకోశ వ్యాధిబారిన పడి ఇబ్బందులు ఎదర్కోవడమే కాకుండా అనారోగ్యాల పాలవుతున్నామన్నారు. కాగా ఈ విషయమై విచారణ జరిపించాలని ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్, టీజీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అదేశించినట్లు ఫిర్యాదుదారులు పోతుగణేష్, తక్కురి దేవ భూమన్న, జిందం రమేష్, తక్కూరి హన్మాడ్లు, శంతన్‌లు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

వేల్పూర్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతా ల్లోని ప్రజలకు బీజేపీ కార్యకర్తలు వివరించాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్కన్నగారి మోహన్ సూచించారు. సోమవారం వేల్పూర్ మండల బీజేపీ కార్యవర్గ సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు బేల్దారి నవీన్ అధ్యక్షతన రామన్నపేట్ గ్రామంలో నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మల్కన్నగారి మోహ న్, మండల ప్రభరి, తోకల నర్సయ్య, మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బానుచందర్, లింగన్న, శక్తికేంద్ర ఇంచార్జులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

జక్రాన్‌పల్లి , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టీయూసీఐ కార్మిక సంఘం తెలంగాణ ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవరాం పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని అర్గుల్ గ్రామంలో గోడప్రతులను ఆవిష్క రించారు. నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి పాత కలెక్టర్ గ్రౌండ్ వరకు బహిరంగ సభ, ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

మాదిగ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వడం హర్షనీయం

సుభాష్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాదిగ సామాజిక వర్గానికి మరో మంత్రి పదవిని అడ్లూరి లక్ష్మణ్‌కు కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

ఆలూర్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు సౌందర్య, వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలన్నారు. భాస్వరం ఎరువులను దుక్కిలో మాత్రమే వేయాలని పైపాలుగా వేయవద్దన్నారు. కార్యక్రమంలో ఏవో రాం బాబు, ఏఈవోలు రమ్య, వసుదాం, వెటర్నరి డాక్టర్ సందీప్‌రెడ్డి, ఏఎంసీ డైరె క్టర్ మల్లారెడ్డి, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి మనిష్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సాగుపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్వేత, విజయ్ కుమార్, వ్యవసాయాధికారి దేవిక, పశువైద్యాధికారిణి అర్పిత, జేఎంకేపీఎం ఎఫ్‌పీవో ఛైర్మన్ తిరుపతిరెడ్డి, గోర్త రాజేందర్, నర్సింహారావు పాల్గొన్నారు.

డిగ్రీ దోస్త్ ప్రత్యేక కేటగిరి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

డిచ్‌పల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి 2025 -26 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ ఎక్స్ట్రా కర్యుకలర్ యాక్టివిటీస్ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన అడ్మిషన్ కార్యాలయంలో రెండో రోజు సోమవారం నిర్వహించారు. ప్రత్యేక కేటగిరిలో ఎన్‌సీసీ-3, స్పోర్ట్స్-4, అడ్మిషన్స్ పొందారని కో-ఆర్డినేటర్ డా.వాసం చంద్రశేఖర్ తెలిపారు. పరిశీలనలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ నేతా, నరేశ్, రవీందర్ నాయక్, పాల్గొన్నారు.

'కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలి'

నిజామాబాద్ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కార్మికులు చేసిన పనికి వేతనాలు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న కార్తికేయ సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అసిస్టెంట్ లేబర్ కమీషనర్ సమక్షంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌తో జరిగిన సమా వేశంలో ఆయన కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, వాకర్స్ సప్లై యూనియన్ అధ్యక్షుడు రాహుల్, జిల్లా నాయకులు మురళి, రవి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

నందిపేట, జూన్ 09 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర నాయకులు కె.గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం నందిపేట మండల తహసీల్థార్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రాజలింగం, లస్మన్న, పుష్పా, గంగవ్వ తదితరులు ఉన్నారు.

'రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

కోటగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో రైతు డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ హామీల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ పాత బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. హామీలను నెరవేర్చకుంటే సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను సైతం దగ్ధం చేస్తామన్నారు.

ఉపకరణాల పంపిణీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-25 సంవత్సరానికి గాను సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 17లోగల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

జోరుగా.. హుషారుగా ఖరీఫ్ పంటల సాగు

● పంటల సాగులో నిమగ్నమైన రైతులు



పంట విత్తేందుకు ట్రాక్టర్ ద్వారా భూమిని చదును చేస్తున్న దృశ్యం



పంట విత్తనాలను విత్తుతున్న మహిళ రైతులు

వేల్పూర్ , జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే కురవడం వల్ల మండల, గ్రామాలలోని రైతులు ఖరీఫ్ పంటల సాగులో రైతులు బిజీ అయ్యారు. మొక్కజొన్న, పసుపు, వరి, సోయాబీన్ పంటల సాగుపనులు రైతన్నలు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం పొలాల్లో నారుమల్లు పనులు కొనసాగుతున్నాయి. మరోభారీ వర్షం పడితే పెద్దఎత్తున పంటలు విత్తే పనులు ఊపందుకోనున్నాయి. గత రబీ సీజన్‌లో రైతులు పండించిన పంటలను మార్కెట్‌లో అమ్ము కున్నారు. కాగా ప్రస్తుతం ఎప్పుడులేని విధంగా గతంలో కంటే పది రోజుల ముందునుంచే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ భూములపై ఆధారపడివున్న రైతులు యథాతథంగా ఖరీఫ్ పంటలు సాగు చేయడంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. అయితే జూన్ నెలలో మృగ శిర కార్తె ప్రారంభమైన తర్వాత భూములను దున్ని పంట సాగు చేసేవారు. ముందస్తుగా వర్షాలు కురువడం వల్ల మృగశిర కార్తె కంటే ముందుగానే పంటసాగు పనులను రైతులు ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపుధర బాగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో గత ఏడాది కంటే పసుపుపంట సాగుపై అధిక మొత్తంలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఖరీఫ్‌లో దాదాపు అన్ని పంటలు కూడా అదే విధంగా సాగుచేయనున్నారు. గత ఏడాది పసుపు 2వేల 900 ఎకరాల్లో సాగుచేయగా ప్రస్తుతం ఈ ఖరీఫ్‌లో 3వేల 200 ఎకరాలు సాగుచేయనున్నారు. గత ఏడాది కంటే 300 ఎకరాల్లో అధికంగా పసుపు సాగు పెరగనుంది. వరి గత ఏడాది 14వేల 600 ఎకరాల్లో సాగుచేయగా ఈ సారి 14వేల 700 ఎకరాలు సాగు చేయనున్నారు. మొక్కజొన్న గత ఏడాది మాదిరిగానే ప్రస్తుతం కూడా 7 వేల ఎకరాల్లో సాగుచేయడం జరుగుతుందని, అలాగే గత ఏడాదిలో సోయాబీన్ 700 ఎరాల్లో సాగుచేయగా ఈ సారి 500 ఎకరాల్లో మాత్రమే సాగు చేయనున్నారని ఏవో శృతి తెలిపారు. బోరు బావుల వద్ద సాగునీటి సౌకర్యం ఉన్న భూముల్లో రోహిణి కార్తె కంటె ముందుగానే మొక్కజొన్న పంటను సాగుచేయడం ప్రారంభించారు. పసుపులో అంతర్ పంటగా మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారు. ముఖ్యంగా పసుపు పంట సాగులో పశువుల పేడ, నల్లమట్టి, ఎరువులు, కూలీలతో కలిసి ఎకరానికి సుమారు 90వేల నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడి చేస్తు పంటను సాగు చేస్తున్నామని రైతులు తెలిపారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగులో రైతుల హడావిడి, పంట చేనులో విత్తనాలు విత్తే పనుల్లో రైతులు, కూలీల సందడి కనిపిస్తుంది.

పంట సాగులో యూరియా వాడకం తగ్గించాలి: ఏవో శృతి


ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగవుతున్న పంటలకు యూరియాను మోతాదుకు మించి వాడకుండా చాలా వరకు తగ్గించాలి. మోతాదుకు మించి యూరియా వాడడం వల్ల పంటపై పురుగుల ఉధృతి పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. పసుపు విత్తనాన్ని సైకోడర్మవిరిడి పౌడర్‌తో శుద్ధి చేసుకున్న తర్వాతనే భూమిలో విత్తాలి. నానో యూరియా వాడడంవల్ల పంట దిగుబడి పెరుగుతుంది. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచన సలహాలను రైతులు పాటించి పంట దిగుబడి పొందాలి.



చేపల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నాటి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నిర్మించే ప్రదేశం



మంత్రి ప్రారంభించిన శిలఫలకం (ఫైల్)



చేపలు విక్రయించే స్టాల్

చేపల మార్కెట్‌కు పనుల ప్రారంభమెన్నడో..?!

● నాడు మాజీ మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన

● నేటికీ ప్రారంభానికి నోచుకొని పనులు ● మత్స్యకార్మికుల వ్యాపారానికి అందని సేవలు

డిచ్‌పల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ.50 లక్షలతో (నీలి విప్లవం స్కీం) చేపల మార్కెట్ నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా 2023 సెప్టెంబరు 14న ఘనంగా శంకు స్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనుల ఊసే లేకపోవడంతో శిలఫలకం వెక్కిరిస్తుంది. రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడవిడిగా శంకు స్థాపన చేశారు. దీని కోసం చెరువుకట్టపై ఖాళీ ప్రదేశాన్ని చదును చేయించారు. నిర్మాణ పనులు ప్రారంభం కాకముందే చేపల విక్రయం స్టాల్‌ను తీసు కొచ్చి అక్కడ ఏర్పాటు చేశారు. కానీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభకాకపోవడంతో మత్స్య కార్మికుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. చేపల విక్రయం రోడ్డు పక్కన జరగడమే అదే తంతువుగా మారింది. మత్స్యకార్మికులకు కనీస వసతులు లేక డిచ్‌పల్లి మార్కెట్‌లో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మూత్రశాలలు, తాగు నీరు వంటి వసతులు ఏమి లేవు. దీంతో దూర ప్రాంతాల నుంచే వ్యాపారులకు, మత్స్య కార్మికులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రతీ ఆదివారం డిచ్‌పల్లిలో చేపల విక్రయాలు అధికంగా జరుగుతుంటాయి. నిజామాబాద్, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, మోపాల్ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, ఈ మార్కెట్‌కు వస్తుంటారు. బుధవారం వారంతపు సంతతో ఈ చేపల మార్కెట్ రద్దీగా ఉంటుంది. వసతులు లేక వ్యాపారస్థులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం వచ్చి ఏడాదిన్నర గడిచిన ఈ పనులు ప్రారంభం కావడం లేదు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి గతంలో రామడుగు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల కార్యక్రమ సభలో మాట్లాడుతూ.. డిచ్‌పల్లి కేంద్రంలో మంజూరైన చేపల మార్కెట్‌కు తాను ఫిషరిస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి సీఎంని కలుస్తామని డిచ్‌పల్లి చేపల మార్కెట్‌కు మరో 50 లక్షల రూపాయలు అదనంగా మంజూరు చేయించి కోటి రూపాయలతో అతిపెద్ద చేపల మార్కెట్ నిర్మి స్తామని చెప్పి నెలలు గడుస్తున్న ఇంత వరకు ఎటువంటి కదలికరాలేదని మత్స్య కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, మత్స్యకార్మికులకు, వ్యాపారస్థులకు న్యాయం చేయాలని, చేపల మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



మోదుగ ఆకులతో కుట్టిన విస్తరాకులు



విస్తరాకులు కుట్టేందుకు ఆరబెట్టిన మోదుగ ఆకులు



అటవీ ప్రాంతంలో ఉన్న మోదుగ చెట్టు

పేపర్ ప్లేట్ల రాకతో కనుమరుగైన మోదుగ విస్తర్లు

● గతంలో కుటీర పరిశ్రమగా వెలిగిన వైనం

● నేడు ప్లాస్టిక్ రాకతో మోదుగ విస్తర్లు మాయం

● మోదుగ ఆకు విస్తర్లకు పూర్వ వైభవం వచ్చేనా..!

పెద్దకొడప్‌గల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత 20 సంవత్సరాల కిందట గ్రామాలతో పాటు, పట్టణాలలో ఏదైనా శుభకార్యం చేస్తే ఆ కార్యక్రమానికి హాజరైన వారికి కడుపునిండా భోజనం వడ్డించేవారు. భోజనం చేసేందుకు గాను మోదుగ ఆకులతో కుట్టిన విస్తర్లు వినియోగించేవారు. భోజనం చేసిన తర్వాత విస్తరాకులను పశువులు పేడ కలిగిన పెంటలలో వేయడంతో విస్తరాకులు కూడ శిథిలంగా మారి ఎరువుగా మారేది. అయితే రాను రాను అటవీ ప్రాంతాలలో మోదుగ చెట్లు తగ్గడం, ప్లాస్టిక్ రాకతో మోదుగ ఆకులతో తయారు చేసిన విస్తరాకులు మాయమయ్యాయి. నేడు ఏ శుభకార్యంలో చూసిన ప్లాస్టిక్ పేపర్‌తో చేసిన విస్తరాకులు దర్శమిస్తున్నాయి. మరో పక్క పర్యావరణ ప్రేమికులు ప్లాస్టిక్‌తో తయారు చేసిన ఈ ప్లేట్లలో తినడం ద్వారా క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేసిన ప్రజలు మాత్రం పేపర్ ప్లేట్లనే వాడుతున్నారు. దీంతో పేపర్ ప్లేట్లు భూమిలో శిథిలం కాకుండ అలాగే ఉండి పర్యావరణానికి ముప్పు కల్గిస్తున్నాయి. అంతేగాక ఫంక్షన్ హాలు సమీపంలో లేదా చెరువు, అటవీ ప్రాంతాలలో పారేసిన ప్లాస్టిక్ పేపర్లు మనుషుల పాలిట శాపంగా మారి వివిధ అనారోగ్యాలకు దారి తీస్తున్నాయి.

గతంలో కుటీర పరిశ్రమగా వర్ధిల్లిన మోదుగ విస్తరాకుల తయారీ

సుమారు 20 నుంచి 30 సంవత్సరాల కిందట వేసవికాలంలో అటవీ ప్రాంతానికి సమీపంగా ఉన్న గ్రామాల్లో తునికాకుతో పాటు గ్రామీణులు మోదుగ ఆకులను అటవీ ప్రాంతం నుంచి సేకరించి ఇంటికి తీసుకవచ్చి వాటిని ఎండ బెట్టి చీపురు పుల్లలు, జొన్న కట్టెలను పుల్లలుగా మార్చి విస్తరాకులను కుట్టేవారు. దీంతో ఏ ఇంట్లో చూసిన మోదుగ ఆకులతో కుట్టే విస్తరాకులు కనబడేవి. ఇక గ్రామాలలో ఏ శుభకార్యం జరిగిన, లేదా ఇంటికి ఎవరైనా అతిధులు వచ్చిన ఈ విస్తరాకులలో వడ్డించేవారు. అంతేగాక శుభకార్యాలు చేసే వారు కార్యక్రమానికి వచ్చిన వారికి బోజనం వడ్డించేందుకు గాను విస్తరాకులను కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. గతంలో 100 ఆకులు కలిగిన మోదుగ విస్తరాకుల కట్ట రూ.100 నుంచి రూ. 150 వరకు అమ్మేవారు. మోదుగ విస్తరాకులలో భోజనం చేయడం వలన ఎలాంటి రోగాలు దరిచేర వని ప్రజలు నమ్మేవారు. అయితే నేడు ఎన్ని డబ్బులు పెట్టి మోదుగ విస్తరాకులను కొందామన్న అందుబాటులో ఉండటం లేదు. పల్లెల్లో ఎవరో ఒకరు తమకు కావాల్సినంత వాటిని మాత్రమే కుట్టుకుని వినియోగించు కుంటున్నారు. గతంలో వందల మందికి ఆధారం చూపిన మోదుగ విస్తరాకులు కుటీర పరిశ్రమగా వర్ధిల్లి నేడు ప్లాస్టిక్ భూతం దాటికి కనుమరుగయ్యాయి.

ప్లాస్టిక్ పేపర్ రాకతో మోదగ ఇస్తరాకులు మాయం..

రాను రాను ప్లాస్టిక్ మార్కెట్‌ను ముంచెత్తడంతో మోదుగ ఇస్తరాకులు మాయం అయ్యాయి. చేతిలో సంచి మొదలు కుని అన్నీ ప్లాస్టిక్‌తో తయారు చేసినవి రావడంతో సహజసిద్ధంగా తయారయ్యే వస్తువులు మాయం అయ్యాయి. అటవీ ప్రాంతం నుంచి మోదుగ ఆకులను సేకరణ చేయడం, అటవీ ప్రాంతాలలో ఆ చెట్లు తగ్గడంతో పాటు ప్రజలు సుఖానికి అలవాటు పడటంతో మోదుగ ఇస్తరాకులు కనుమరుగయ్యాయి. నేటి పిల్లలకు విస్తరాకులు అంటే పేపర్‌తో తయారయిన విస్తరాకులు చూపిస్తారు తప్పా మోదుగతో చేసిన విస్తరాకులు తెలియక పోవడం గమనార్హం. సహజ సిద్ధంగా లభించే వస్తువులు కన్నా ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులు అందుబాటులో ఉండటంతో జనాలు ప్లాస్టిక్ వైపే మొగ్గుచూపుతున్నారు. ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడకూడదని, దీంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు రోగాలు వస్తాయని పర్యావరణ ప్రేమికులు ఎంత చెప్పిన ప్రజలు అర్థం చేసుకోలేకపోవడం నిజంగానే దురదృష్టం.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే కుటీర పరిశ్రమలకు జీవం

గతంలో గ్రామాల్లో కుటీర పరిశ్రమగా వర్ధిల్లిన మోదుగ ఆకుల విస్తరి తయారీ కేంద్రాలు ప్లాస్టిక్ రాకతో మరుగునపడ్డాయి. ఎంతో మంది విస్తరాకులను కుట్టి అమ్ముకోవడం వలన తమ కుటుంబ భారాన్ని దించుకునేవారు. అయితే గతంలో విధంగా మోదుగ ఆకులతో చేసిన ఇస్తర్లు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం మహిళ సంఘాల ద్వారా ఈ పరిశ్రమను నిర్వహిస్తే తిరిగి మోదుగ విస్తరాకులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ ఉత్పత్తులకు ప్రభుత్వం ఏ విధంగా అయితే చేయూత నందిస్తుందో ఈ ప్రాంతంలో కూడా అలాగే ప్రోత్సాహం అందించాలని ప్రజలు కోరుతున్నారు.



మోర్తాడ్ బస్టాండ్ ప్రాంతంలో కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

నాలుగేళ్లకు బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం

మోర్తాడ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ జాతీయ రహదారిని నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గమధ్యలో కూలిన బ్రిడ్జికి ఎట్టకేలకు మోక్షం లభించింది. కూలిన నాలుగేళ్ళకు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణంతో రైల్వే ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్నాయి. మొండివాగుపై గతంలో చిన్నగా వంతెన ఉండడంతో భారీ వర్షాలకు బ్రిడ్జి కూలిపోవడంతో పాటు రెండువైపుల బ్రిడ్జిపక్కన వేసిన మట్టిరోడ్డు కూడా కొట్టుకుపోయింది. దీంతో రైల్వే ప్రయాణికులు రావడానికి, పోవడానికి ఎన్నో అవస్థలు పడ్డారు. నిజామాబాద్ తర్వాత అతిపెద్ద రైల్వేస్టేషన్ మోర్తాడ్‌లోనే ఉంది. ఈ స్టేషన్ నుంచి కరీంనగర్, బొంబాయికి వెళ్లే వారు అధికంగా ఉంటారు. నాలుగు సంవత్సరాలుగా ఇబ్బందులు పడ్డ ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని వర్షాలు పడక ముందే యుద్ధ ప్రాతిపధకన పూర్తిచేస్తే మంచి దని అంటున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే నిర్మాణ పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి పూర్తయితే ఆటోవాలాలకు మంచి రోజులు ..

- అర్షద్, మోర్తాడ్



రైల్వే బ్రిడ్జి సకాలంలో పూర్తయితే ఆటోవాలలకు మంచి రోజులు వస్తాయి. రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు, మోర్తాడ్ బస్టాండ్ నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలన్న ఆటోలు అందుబాటులో ఉంటాయని దీంతో ఆటోలకు గిరాకి పెరుగుతుంది.

టీయూ స్నాతకోత్సవానికి హాజరుకండి

● గవర్నర్‌కు ఆహ్వానం అందజేసిన టీయూ వీసీ యాదగిరి రావు



టీయూ స్నాతకోత్సవానికి హాజరుకావాలని వర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్‌ను కలిసిన టీయూ వీసీ యాదగిరి రావు

డిచ్‌పల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో జూలై మూడో వారంలో జరిగే విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను టీయూ వీసీ ప్రొ.యాదగిరిరావు ఆహ్వానం అందజేశారు. రాజ్‌భవన్‌లో సోమవారం గవర్నర్‌ను కలిసిన టీయూ వీసీ తెలంగాణ విశ్వ విద్యాలయంలోని పలు అంశాలను వివరించారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యా ద్వారానే రాష్ట్ర సమాగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గవర్నర్ పిలుపునిచ్చారు. సాంకేతిక విద్యా అభివృద్ధితో పాటు వర్సిటీలలో జరిగే మానవ వనరుల అభివృద్ధి కూడా ప్రధాన భూమిక పోశిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ వికాసానికి ప్రాంతీయ వర్సిటీలు నిర్మాణాత్మక కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రాంతంలో అనేక విలువైన సహజ వనరులు ఉన్నాయని వాటిని వెలికి తీసే దిశగా విభిన్న రంగాల్లో లోతైన పరిశోధనలు వర్సిటీలలో జరగలన్నారు. ఈ క్రమంలో తెలంగాణ వర్సిటీ పరిధిపై, విద్యా అభివృద్ధిపై సమగ్రంగా చర్చించి భవిష్యత్తు రాష్ట్ర విద్యారంగం పట్ల దార్శనికతతో కూడిన పలు సూచనలు ఇచ్చారని వీసీ యాదగిరి తెలిపారు.

జైల్లో పెట్టిన రైతులను విడుదల చేయాలి

నిజామాబాద్ కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గద్వాల్ జిల్లా జోగులాంబ మండలంలోని పెద్ద ధన్వాడాలో ఇథనాయిల్ ఫ్యాక్టరీని అడ్డుకున్న రైతులపై అక్రమ కేసులతో జైల్లో పెట్టిన రైతులను వెంటనే విడుదల చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇథనాయిల్ ఫ్యాక్టరీ వల్ల గాలి, నీరు, భూమి కలుషితమై ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఫ్యాక్టరీ మాకు వద్దన్నా ఆ ఫ్యాక్టరీ నిర్మాణం జరపడానికి పూనుకోవడంతో అక్కడి రైతులు వ్యతిరేకించడంతో వారిపై కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని ఆయన ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అంటూ రైతులపైనే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం ఇప్పటి వరకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దొరకక రైతులు అవస్తలు పడుతున్నారన్నారు. రైతులకు ఉచితంగానే విత్తనాలు, ఎరువులు, మందులు అందజేయాలని అర్హులైనటువంటి రైతులందరికి సరిపడా రుణాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి కానీ వ్యాపారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అంతకుముందు ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాలి నర్సయ్య మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయరెడ్డి, ఉపాధ్యక్షులు ఎర్రన్న, సాయిలు, సహాయ కార్యదర్శి పర్వన్న, నాయకులు పోచన్న పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తే కేసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):ప్రజలకు పంపిణీచేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా కలిగి ఉన్నా, తరలించినా 6 ఏ కేసులు నమోదుచేస్తామని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి మల్లిఖార్జున్ బాబు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన బియ్యం దందా ఆగేనా అనే కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని డిప్యూటీ తహసీల్ధార్లు అక్రమ పీడీఎస్ బియ్యం రవాణాపై కఠినమైన నిఘా ఉంచాలని, ఎస్‌పీఎస్, ట్రేడింగ్ దుకాణాలపై దాడులు నిర్వహించాలని ఇప్పటికే సూచనలు జారీచేశామని తెలిపారు. ఇప్పటికే ఎల్లారెడ్డి, కామారెడ్డిలలో అక్రమంగా తరలిస్తున్న, నిల్వఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరోసారి అధికారులు అప్రమత్తంగా ఉంటూ అక్రమ మళ్లింపులో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించామని తెలిపారు.

భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బైపీసీ కోర్సు మంజూరు



భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

భిక్కనూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బైపీసీ కోర్సు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రాధాబాయి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికిగానూ బైపీసీ నూతన కోర్సును ప్రారంబించి అధ్యాపకులను నియమించామన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి షేక్‌సలాంకు కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

కామారెడ్డిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో యాదవ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. 2024-25 విద్యాసంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరిచిన పదోతరగతి, ఇంటర్మీడియట్ యాదవ విద్యార్థులకు శాలువాతో సత్కరించి మెమోంటో, ప్రశంసాపత్రం అందించామని వేదిక అధ్యక్షుడు యోట్టం సాయన్న తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా కష్టపడి మంచి స్థానంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ ఎంప్లాయీస్ ప్రధానకార్యదర్శి జక్కుల శ్రీనివాస్, సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన యూనియన్ బ్యాంక్ సేవలు



రద్దీగా ఉన్న బ్యాంక్

మహమ్మద్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో సోమవారం సర్వర్ రాకపోవడంతో బ్యాంక్ సేవలు నిలిచిపోయాయి. వరుసగా శని, ఆదివారాల్లో సెలవులు కావడంతో వ్యవసాయ పనుల కోసం డబ్బుల నిమిత్తం బ్యాంక్‌కు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పిల్లలకు ఉచిత వైద్యం

సదాశివనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు వద్ద గల శ్రీ కృష్ణ హాస్పిటల్‌లో చిన్నారులకు వారం రోజుల పాటు ఉచిత వైద్యం అందిస్తామని నిర్వాహకులు మోహన్‌రావు తెలిపారు. చిల్డ్రన్ వైద్యనిపుణులు డాక్టర్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో ఉచితవైద్య చికిత్సలు నిర్వహిస్తారన్నారు. వారంరోజులు నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

ఏఐసీసీ మహిళా సమావేశానికి తరలిన జిల్లా నాయకురాలు

కామారెడ్డిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ ట్రెయినింగ్‌కు జిల్లా మహిళా విభాగం కాంగ్రెస్ అధ్యక్షురాలు పాకజ్ఞానేశ్వరి సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని కామారెడ్డి, వనపర్తి, నిర్మల్, సిరిసిల్ల, మెడ్చల్ జిల్లాలకు చెందిన మహిళా అధ్యక్షురాలు ఈ శిక్షణకు ఎంపికైనట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు అలక లంబాజీ ఆధ్వర్యంలో చేయాల్సిన పలు అంశాలను ఈ శిక్షణలో వివరించనున్నట్లు ఆమె తెలిపారు.

బదిలీపై వెళ్తున్న హోంగార్డులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న వారికి వీడ్కోలు పలుకుతున్న పట్టణ పోలీసులు

కామారెడ్డిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాల నుంచి కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఏడుగురు హోంగార్డులను సీఐచంద్రశేఖర్‌రెడ్డి సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలువురు హోంగార్డులను ఎస్పీ రాజేష్‌చంద్ర బదిలీ చేయగా పట్టణ పోలీసుస్టేషన్‌లో పనిచేసే మురళి, బాలరాజు, రాజి రెడ్డి, బషీర్, ప్రభాకర్,అక్తర్, షైసయ్యలు ఆయా పోలీసుస్టేషన్‌లకు బదిలీపె వెళ్లారని తెలిపారు. సమర్థంగా విధులు నిర్వర్తించినందుకు వారికి సన్మానించి వీడ్కోలు పలికామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పోలీసుస్టేషన్‌లోని ఎస్ఐ, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

బిచ్కుంద, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా బిచ్కుంద పోలీసు స్టేషన్‌లో హోంగార్డులుగా పనిచేసిన మదు, సాయిలు, రాములుల సేవలు అభినందనీయమని ఎస్ఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం బదిలీపై వెళ్తున్న హోంగార్డులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలు విధుల నిర్వహణలో అశ్రద్ధ వహించకుండా మంచి సేవలు అందించారని తెలిపారు. ముందు ముందు ఇతర స్టేషన్‌లలో సైతం మంచిసేవలు అందిస్తు డిపార్టమెంట్‌లో గుర్తింపు పొందాలని సూచించారు.

విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందాలి

దోమకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి):దోమకొండ పోలీసుస్టేషన్‌లో సుమారు మూడుసంవత్సరాలుగా విధులు నిర్వహించిన హోంగార్డు స్వామి సాధారణ బదిలీల్లో భాగంగా మాచారెడ్డి పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా సోమవారం పోలీసుస్టేషన్‌లో ఎస్సై స్రవంతి స్వామిని శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీధర్, పీసీలు రమేష్, అలేఖ్య సాయిబాబా పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

● ఎంపీడీవోకి గ్రామ పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

ఎల్లారెడ్డిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై సోమవారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాష్‌కు వినతి పత్రం అందించారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సంబంధించి ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ చెక్కులు క్లియర్ కాకపోవడం వలన అనేక రకమైన సమస్యలను ఎదుర్కొంటున్నామని ఇకపై గ్రామాలలో ఆర్థికపరమైన పనులు నిర్వహించలేమని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీల నిర్వహణలో భాగంగా ట్రాక్టర్ డీజీల్ ఖర్చులకు, తాగునీటి నిర్వహణకు, వీధిదీపాలు, పారిశుద్ధ్య పనుల ఖర్చుల నిమిత్తం ప్రతినెల గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్న వారిని జీపీఎస్‌లుగా కన్వర్ట్ చేసి ఓపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. మున్సిపల్ తరహాలో ప్రతి గ్రామపంచాయతీకి ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరిచి సాధారణ నిధులకు అనుసంధానం చేయాలని, వీటితో పాటు తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు రాజు,ప్రదీప్, సలీం, శంకరయ్య, ప్రసాద్, రాజయ్య, స్వప్న, సవిత, జ్యోతి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర జెఏసీ పిలుపు మేరకు అన్ని మండల కార్యాలయాల్లో ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన చెక్కులను తొందరగా చెల్లించడంతో పాటు, పెండింగ్ బిల్లుల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల నిర్వహణ భారం అయితున్నందున నిధులు విడుదల చేయా లన్నారు. దీంతో పాటుగానే ఓపీ ఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించి 4 సంవత్సరాల ప్రొబిషన్ కాలాన్ని సర్వీసు కింద గుర్తించాలని పేర్కొన్నారు. గ్రామాల నుంచి మండల కార్యాలయానికి సమావేశం కోసం వచ్చే ప్రతి కార్యదర్శికి టీఏ చెల్లించాలన్నారు. 317 జీవో ద్వారా ఇతర జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులను సొంత జిల్లాలకు పంపించాలని తెలిపారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధం లేని పనులు కార్యదర్శులకు అప్పగించరాదని, డీఎస్‌ఆర్ యాప్‌ను విరమించుకోవాలని, అంత అవసరం అనుకుంటే గ్రామ పంచాయతీల వద్ద బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సుజాత, కవిత, అనిల్, విక్రమ్, హరీష్, రమేష్, రాజేందర్, సాయిలు, ప్రదీప్, మష్తారెడ్డి, శివాజీ పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

నాగిరెడ్డిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం ద్వారా భూముల సమస్యలను పరిష్కరించేందుకు మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి భారీ స్పందన లభిస్తుంది. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రైతుల నుంచి వందలాది దరఖాస్తులు వస్తున్నాయి. ఐదోరోజు సోమవారం మండలంలోని తాండూర్, రాఘ వపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ధరణి ద్వారా పరిష్కారం కానీ భూ సమస్యలు, భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం కానునుండడంతో రైతులు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఐదో రోజు రెండు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూ సమస్యల పైన 322 దరఖాస్తులు వచ్చినట్లు తహసిల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. తాండూర్ గ్రామంలో 136, రాఘవపల్లి గ్రామంలో 186 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో పది గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పైన రైతుల నుంచి 821 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఆర్ఐ, మహ్మద్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : ప్రభుత్వం చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో భూసమస్యలు పరిష్కరిస్తామని మండల డీటీ రవికాంత్ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో నిర్వహించిన భూభారతి సదస్సులో ప్రజల నుంచి వివిధ భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ గతంలో ధరణి ద్వారా గ్రామాల్లో భూమికి సంబంధించిన కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, అటువంటి వాటిని పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నా మన్నారు. కాస్లాబాద్ గ్రామంలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 45 దరఖాస్తులు వచ్చాయని, వాటిని అధికారుల దృష్టికి తీసు కువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్ఐ అంజయ్య, సిబ్బంది లావణ్య, సాయిలు, రమేష్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి, బస్వాపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీత మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రోజ, ఆర్ఐ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మద్నూర్ : భూ సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని మద్నూర్ తహసీల్దార్ వెల్లడించారు. సోమవారం మండలంలోని మేనూర్, రూసేగావ్ గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో వచ్చిన 97 దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించి రైతుల భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం చేసుకునే దరఖాస్తులకు సంబంధిత పత్రాలను జతపరచి అధికారులకు సమర్పించాలని రైతులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను షెడ్యూల్ ప్రకారం ఈనెల 20వ వరకు పారదర్శకంగా కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్ సిబ్బంది ఉన్నారు.



బస్వాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం



మద్నూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

మద్నూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పతాంజలి యోగా సమితి సభ్యులు సంజు జూబ్రే అన్నారు. ఈనెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధకులు, విద్యా సంస్థలు, సామాజిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థల వారు తమ పరిధిలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం మారిన జీవనశైలి ఆహారపు అలవాట్లు మానవుడి ఆయుష్షును తగ్గిస్తు న్నాయని సర్వం కల్తీమయం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతు న్నారని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు యోగ ఉత్తమ మార్గం అని గుర్తు చేశారు. ఈ విషయాన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సూచించాలని తెలి పారు. కార్యక్రమంలో ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛంద సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

కామారెడ్డిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీతో పాటు పుస్తకాలు, యూనిఫార్మ్, షూస్, టై, బెల్ట్ అంటూ విచ్చలవిడిగా అధిక ధరలకు విక్రయిస్తు దోపిడీ చేస్తున్నాయన్నారు. అనుమతులు లేని పాఠశాలలు సైతం కొత్త అడ్మిషన్లు తీసుకుంటూ పుస్తకాలు విక్రయిస్తున్న కూడా విద్యాశాఖాధికారి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలపై, విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే పుస్తకాలు, యూనిఫార్మ్ విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

పెద్దకొడప్‌గల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అర్జున్ మాట్లాడుతూ ప్రతిసంవత్సరం అంగన్‌వాడీ చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలలో భాగంగా పిల్లల శారీరక ఎదుగుదల, పోషకాహారలోపంతో బాధపడే చిన్నారులను గుర్తించడం, అంతర్గతంగా ఉండే వ్యాధులను గుర్తించి వారిని చికిత్సనిమిత్తం ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తామని తెలిపారు. దీంతో పాటుగానే సీజనల్‌వ్యాధులపై అవగాహన, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తామన్నారు. దీంతో పాటుగానే బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి వారు బరువు పెరిగేలా చర్యలు తీసు కుంటామని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్ర మంలో ఏఎన్ఎం సద్గుణ, అంగన్‌వాడీ కార్యకర్త స్వరూప పాల్గొన్నారు.

వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి శారీరక దివ్యాంగులు, అంధులకు, బధిరులకు,మానసిక దివ్యాం గులు వాహనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెట్రోఫిట్టెడ్ మోట రైజ్డ్ వెహికల్స్, బ్యాటరీ వీల్‌చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, బ్యాటరీ మినిట్రేడింగ్ ఆటో వెహికల్స్, హైబ్రిడ్ వీల్‌చైర్ అటాచ్‌మెంట్, ల్యాప్‌టాప్స్, ట్యాబ్స్, 4 జీ స్మార్ట్ ఫోన్స్, ట్రైసైకిల్స్, క్యాలి పేర్స్, ఆర్టిఫి షల్ లింబ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్‌కేన్స్, బ్రెయిలీ బుక్స్, బ్రెయిలీ కిట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, ఎంఆర్‌సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సులు దారి తప్పుతున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

సమస్యలతో బస్సులు నడుస్తున్నాయి. ఎదైన సంఘటనలు జరిగినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

● **తరచూ చోటుచేసుకుంటున్న ఆర్టీసీ ప్రమాదాలు**

జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలతో పాటు ఆర్టీసీ ప్రమాదాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి. ఇటీవల ఆర్టీసీ బస్సుల వల్ల జరిగిన ప్రమాదాలతో నలుగురు మృతిచెందగా మరో 10 మంది క్షతగాత్రులు అయ్యారు. ఇలా గతంలోను జిల్లాలో 12 వరకు ఆర్టీసీ ప్రమాదాలు చోటుచేసుకోగా 8 మంది మృతిచెందినట్లు ఆర్టీసీ రికార్డులు చెబుతున్నాయి. సోమవారం రాజంపేట మండలం పెద్దాయిపల్లి గేట్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తాత,మనుముడు బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఇటీవల కామారెడ్డి డిపో పరిధిలోని ఓ ప్రాంతంలో ఆర్టీసీ కండెక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రయాణికుడు బస్సు టైర్ల కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనలో కండెక్టర్‌ను ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేశారు. గత 6 నెలల కిందట మాచారెడ్డి మండలంలోని బస్టాండ్‌లో విద్యుత్ స్తంభాన్ని బస్సు ఢీకొనడంతో స్తంభం నెలకొరిగింది. ఆ సమయంలో విద్యుత్ ప్రవాహం ఉండగా బస్సుకు కొద్దిదూరంలో స్తంభం పడిపోయింది. ఆ సమయంలో ఏ మాత్రం బస్సుపై స్తంభం పడిన భారి ప్రమాదం చోటు చేసుకునేది. ఇలా గతంలోను మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ శివారులో జరిగిన ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో డ్రైవర్‌నిర్లక్ష్యం ఉన్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ బస్సులు హైయర్ బస్సు డ్రైవర్ నిరక్ష్యం కారణంగా ఐదుగురు ప్రాణాలుకోల్పోవాల్సి వచ్చింది. ఇలా జిల్లాలో ఆర్టీసీ బస్సుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి.

పట్టణంలో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది ఈ నీటి నిల్వలను తీసివేసేందుకు పనులు చేపట్టారు. గత నెలరోజుల నుంచే ఈ పనులు చేపడుతూ ఉంటే ప్రజలకు,వాహనదారులకు ఇక్కట్లు తప్పెవి కదా అనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఇప్పటికైన అధికారులు ఆయా చోట్ల సంపూర్ణంగా పనులు చేపట్టి వరద నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నాగిరెడ్డిపేటలో 53.3 ఎంఎం వర్షపాతం

నాగిరెడ్డి పేట : నాగిరెడ్డిపేట మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మృగశిర కార్తే ప్రారంభంతోనే వరుణ దేవుడు కరుణించి వర్షం కురవడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి మండలంలోకురిసిన వరపాతం 53.3 ఎంఎంగా నమోదైనట్లు తహసిల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు.

అంతర్రాష్ట్ర గ్యాంగ్ అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

కామారెడ్డి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారులపై, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న గ్రామాల్లో దోపిడీ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర పార్థీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పీ నర్సింహారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన నాందేవ్, రాథోడ్ అజిత్ రమేష్, గజానంద్ రామారావు, బాస్కర్ చౌహాన్, కర్ణాటకకు చెందిన కృష్ణ బాబు సింధే గ్రూపుగా ఏర్పడి 44వ జాతీయరహదారులపై నిలిచి ఉన్న వాహనాలను, జాతీయరహదారిని ఆనుకున్న గ్రామాలలో మారణాయుధాలతో బెదిరించి దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నారని, వారిపై మహారాష్ట్రలో హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశారని తెలిపారు. వారు కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలోని పలుప్రాంతాల్లో దోపిడీ, చోరీలు చేయగా గాంధారి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. వీరిని పట్టుకోవడానికి రెండు బృందాలతో గాలిస్తుండగా మొండిసడాక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వీరిలో ముగ్గురు ద్విచక్రవాహనాలపై గాంధారి వైపు వెళ్తుండగా పట్టుకుని విచారించగా గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి మూడు తులాల బంగారు అభరణాలు, 12 తులాల వెండి, కత్తులు, సెల్‌ఫోన్లు, తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ ఎస్సై శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. భాస్కర్ చౌహాన్ తప్పించుకోగా త్వరలోనే అతడిని పట్టుకుంటామన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి




సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్‌ఆఫీసర్ అనిల్‌కుమార్

బీర్కూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని మండల స్పెషల్ ఆఫీసర్ అనీల్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ అనీల్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా గ్రామాల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

దోమకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గేదే మృతిచెందిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన బట్టుభాస్కర్ అనే రైతుకు చెందిన గేదే మేత మేస్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు తెలిపారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కరాటే కిడ్
ప్రియా 70 - ఖలేజా
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - థగ్ లైఫ్
వెంకటేశ్వర - శ్రీశ్రీశ్రీరాజావారు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

